కథ

# ఖలి

- చోడిశెట్టి శ్రీనివాసరావు



కళ్ళు తెరవగానే కనిపించిన పరిసరాలను బట్టి నేను ఆస్పత్రిలో వున్నట్టు అర్థమైంది.

నెమ్మదిగా లేవబోతుంటే 'సెలైన్' ఎక్కుతున్న నాచేతిని నొక్కిపట్టుకున్న అమ్మ లేవొద్దని వారించింది. వారం రోజులపాటు బెడ్‌మీదినుంచి కదలకూడదని డాక్టరన్నట్టు పవిట చెంగుతో కళ్ళొత్తుకుంటూ చెప్పింది.

"ఇది వగలా....?" సందిగ్ధంగా అమ్మవైపు చూశాను.

"కాదు-రాత్రి. ఇరవై నాలుగు గంటలు గడిచాయి!" అంది అమ్మ.

'ఏంటీ....ఒకరోజంతా స్పృహ లేకుండా నేనీబెడ్ మీదున్నానా!' నమ్మబుద్ధి కాలేదు. కానీ, ఆ మాటచెప్పింది అమ్మగనక నమ్మక తప్పలేదు. చిన్నగా నిట్టూర్చి కళ్ళు మూసుకున్నాను. జరిగిన ప్రమాదం గుర్తుకొచ్చి నా ఒళ్ళు ఝల్లుమంది....

నిన్నరాత్రి.... సమయం పదిగంటలు దాటింది. అమావాస్య కావడంతో చిక్కని చీకటి నలువైపులా కమ్ముకొని వుంది. ఆకాశంలో దట్టంగా పట్టిన మబ్బులవల్ల నక్షత్రాలు కూడా కానరావడంలేదు. వుండుండీ రివ్వున గాలివీస్తోంది.

నా గురువు మూర్తి నడుపుతున్న లారీ నల్లని తారురోడ్డుమీద వేగంగా ముందుకు పరిగెడుతోంది. చల్లగాలికి మెల్లగా నాకళ్ళు మూతపడుతున్నాయి.... ఆయన ఎప్పుడు గమనించాడో "నిద్రపోతున్నావా కిష్టీ! ఊరు దగ్గరపడుతోంది. ఇంకాస్సేపు ఓపిక పట్టు; ఇంటికెళ్ళగానే రెండురోజులపాటు మంచం దిగకుండా నిద్రపోదువులే!" అన్నాడు వేళాకోళంగా.

"లేదు గురూ!..... లేదు...." అంటూనే పెద్దగా ఆవులించాను నేను.

"బావుందిరా..... ఇలా ఆవులిస్తూ-కునుకుతూ వుంటే రేపొద్దున్న లారీ ఎలా నడిపేదుస్తావ్?" కాస్త చిరాకు పడుతూ అన్నాడాయన.

"ఖాళీగా వుండబట్టి నిద్రొస్తుందిగాని లారీ నడిపేటప్పుడు ఎందుకు నిద్రపోతాను గురూ! మొన్న రెండు గంటలపాటు నువ్వు పడుకుంటే నేను లారీ నడిపాను కదా..." అన్నాను నవ్వుతూ.

"ఏమిట్రోయ్, ఇల్లు అలకగానే పండుగ అయిపోయినట్టు మాట్లాడుతున్నావ్... ఈ డ్రైవింగ్‌లో నువ్వు తెలుసుకోవాల్సింది ఇంకెంతో వుంది. గంటో-రెండు గంటలో లారీ నడిపి గొప్ప ప్రవీణుడివై పోయినట్టు ఫీలైపోకు!" అన్నాడు కోపంగా నాగురువు. నేను కిక్కురు మనలేదు.

"ఏంటోరా నిన్నంటున్నాను కాని నాకే నిద్రముంచుకొచ్చేస్తోంది. ఎప్పుడు ఇల్లుచేరి భార్యా బిడ్డల్ని చూసుకొని పక్కమీద వాలిపోదామా

అనివుంది" అని తనూ ఆవులించాడు.

నిజమే మరి... మేము లారీలో సరుకు వేసుకొని బయలుదేరి, ఒరిస్సాలో అవి చేరాల్సిన వాళ్ళకి చేర్చి తిరుగుముఖం పట్టేసరికి అయిదు రోజులు గడిచిపోయినై. పని గంటలతో నిమిత్తంలేకుండా నిత్యం ఇలా ఊళ్ళు తిరిగే లారీలో క్లీనర్‌గా ఉద్యోగం చెయ్యడం నాకెంత మాత్రం ఇష్టంలేదు. ఈ సారెందుకో ఇంకా బాధనిపించింది.

ఆమాటే గురువుతో అంటే 'నువ్వు పదోతరగతి వెలగబెట్టి ఈ పని చెయ్యడానికి బాధపడిపోతున్నావు. డిగ్రీ చదివి నేనీ డ్రైవింగ్ వృత్తికి అంకితమై పోయానురా!.... అయితే ఎవరు చేసేపనిలో వాళ్ళకేవో సాధక బాధకాలు వుంటూనే వుంటాయి. అంతమాత్రాన చేస్తున్న పనిపట్ల విరక్తి పెంచుకోవడం తప్పు. బతకడానికి ప్రతి మనిషీ ఏదొక పనిచెయ్యక తప్పదుగా. ఈ రోజు క్లీనరే-రేపటి డ్రైవరు కాబట్టి నిన్ను నీవు కించపర్చుకోకు' అంటూ బుజ్జగించాడు. ఉద్యోగం కష్టమే అయినా-ఒనరిచ్చే జీతం తక్కువే అయినా దారిలో ఎక్కిదిగే ప్రయాణీకుల వల్ల డబ్బులు బానే వస్తుంటాయి మాకు.

"గురూ! తిమ్మాపురం వచ్చేశాం" అన్నాను-ఊరు మొగదలనున్న సినిమాహాలునీ, హాలు ముందు టిక్కెట్లకోసం కుమ్ములాడుకుంటున్న జనాన్నీ చూస్తునే.

"అవున్రా... నేను మేలుకునే వున్నాలే.... ఇంద ఆ కిళ్ళీషాపులో ఓ అగ్గిపెట్టె చార్మినార్ సిగరెట్ ప్యాకెట్ తీసుకురా!" అని సినిమాహాలు సమీపంలో లారి ఆపి జేబులోంచి డబ్బులు తీసిచ్చాడు నాగురువు.

నేను గబగబా షాపువద్దకెళ్ళి వాటిని తీసుకొచ్చి ఇచ్చి నాసీట్లో కూర్చున్నాను.

"ఇక పావుగంట ప్రయాణంరా!" అని సిగరెట్ వెలిగించుకొని లారీ స్టార్ట్ చేశాడాయన.

ఒకే. ఒక్క నిమిషంలో ఊరుదాటింది లారీ. ఊరితోపాటు వీధిదీపాల కాంతి కూడా దూరమైంది. లారీ హెడ్‌లైట్స్ వెలుగు తప్ప అంతా చీకటిమయంగా ఉంది. మొదటి ఆటసినిమా చూసిన కొంతమంది కుర్రాళ్ళు ఏవో పాటలుపాడుతూ సైకిళ్ళ మీదపోతున్నారు... కొందరు రిక్షావాళ్ళు నలుగురైదుగురు మనుషుల్ని ఎక్కించుకొని తమ శక్తికి మించిన బరువును గమ్యం చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

వాళ్ళందరినీ దాటి కాస్తముందుకెళ్ళి కుడిచేతిలో వున్న సిగరెట్ పెదవుల మధ్య పెట్టుకున్నాడు నా గురువు. పొగరాలేనట్టుంది-'వెధవ సిగరెట్ ఆరిపోయిందే' అని తిట్టుకుంటూ స్టీరింగ్ మీదున్న ఎడమచెయ్యి కూడా తీసి సిగరెట్ వెలిగించుకునేందుకు అగ్గిపుల్ల గీశాడు. రివ్వున వీస్తున్న గాలికది ఆరిపోయింది... మళ్ళీ మరో అగ్గిపుల్ల గీశాడు.... సిగరెట్ వెలగలేదు గాని-రోడ్డుమీదున్న గోతిలో పడ్డలారీ మమ్మల్ని ఎత్తికుదేసి-నా గురువు స్టీరింగ్ చేతిలోకి తీసుకునేటంతలోనే అదుపుతప్పి పక్కనున్న పెద్ద చెట్టును గుద్దుకొంది.....

అంతే-ఆ తర్వాత ఏం జరిగిందో.... ఏ పుణ్యాత్ములు మమ్మల్నీ ఆస్పత్రిలో చేర్చి పుణ్యం కట్టుకున్నారో తెలియదు.... ఇంతకీ నా గరువు మూర్తిగారెక్కడ? ఆయనకెలా వుందో?.... గభాలున కళ్ళు తెరిచి అమ్మనడిగాను.

అమ్మ పెదవి విరిచి మౌనంగా ఉండిపోయింది.

అంటే-మూర్తి..... నాగురువు మూర్తి ఇకలేడన్న మాట! అయ్యో, ఎంతదారుణం జరిగిపోయింది?.... లారీ ఆపి సిగరెట్ వెలిగించుకొని వుంటే అసలీ ప్రమాదం సంభవించి వుండేదికాదు గదా.... ఈ వృత్తిలో క్షణకాలమైనా నిర్లక్ష్యం తగదని పదేపదే చెప్పే నా గురువు ఎందుకిలా చేశాడు?.... చెడు అలవాటు మనిషిని జ్ఞాన రహితుణ్ణి చేస్తుందా?.... మొత్తానికి ఆరిపోయిన సిగరెట్ ఆయన నిండుప్రాణాన్ని బలి తీసుకొంది. పొంగుకొస్తున్న దుఃఖాన్ని నేనిక ఆపుకోలేకపోయాను.... ★


చదవండి! చదివించండి!!
గోదావరి సాహిత్య మాసపత్రిక
వార్షిక చందా కేవలం రూ. 100/- మాత్రమే
సభ్యులుగా చేరండి!..చేర్పించండి!!